# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్
- ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ నాణ్యమైన బోధన అందించాలి
- ఖమ్మం నగరం 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

2 లో... ▸






జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

శుక్రవారం | 31 | జులై | 2026 ◆ పేజీలు : 6





# ప్రజల గడపకే పాలన సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- కల్లూరు ప్రజా దర్బార్ లో పాల్గొన్న మంత్రి పొంగులేటి
- భూ రీ - సర్వేతో రెవిన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**కల్లూరు, జులై -30 ప్రజాజ్యోతి** ప్రజల సమస్యలను ప్రభుత్వం నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కల్లూరు డీఎన్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం కల్లూరు, తల్లాడ మండలాలకు సంబంధించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మొత్తం సుమారు 3,500 దరఖాస్తులు అందాయని తెలిపారు.వాటిలో 1,800 ఇందిరమ్మ ఇళ్లకు, 500 వరకు రెవెన్యూ సమస్యలకు, 200 పెన్షన్లకు, ఇతర మిగతా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని చెప్పారు. ఇదే విధంగా పాలేరు నియోజకవర్గ ప్రజా దర్బార్‌లో 25 వేల దరఖాస్తులు అందగా, వాటిలో 13 వేల దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవేనని తెలిపారు. ప్రజల అవసరాలను

మిగతా 2 లో... ▸

# యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ ను బీసీ యువత సద్వినియోగం చేసుకోవాలి



- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- అర్హులైన ప్రతి బీసీ అభ్యర్థి గడువులోగా లాంగ్ టర్మ్ కోచింగ్ కు దరఖాస్తు చేసుకోవాలి
- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత లాగ్ టర్మ్ కోచింగ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రభుత్వం ప్రతిభావంతులైన బీసీ యువతకు కల్పిస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని, అత్యున్నత సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు.గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిపాలనలో

మిగతా 2 లో... ▸

# ఖమ్మంలో నిస్సాన్ "టెక్ టోన్" కారు ఆవిష్కరణ

- వివిసి ఆటోమొబైల్స్‌లో వాహనాన్ని విడుదల చేసిన ఎంవీఐ టి. రాంబాబు




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ సరికొత్తగా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన ‘టెక్ టోన్’ (టెక్టన్ ) ఎస్ యు వి కార్‌ను ఖమ్మం నగరంలోని నిస్సాన్ ఆథరైజ్డ్ డీలర్‌షిప్ "వివిసి ఆటోమొబైల్స్" ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి.రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై కారును ప్రారంభించారు. రహదారి భద్రతపై ఎంవీఐ రాంబాబు సూచనలు: ఈ సందర్భంగా ఎం.వి.ఐ రాంబాబు మాట్లాడుతూ— వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలి.సరైన ఇన్సూరెన్స్ పత్రాలు లేకుండా వాహనాలను రహదారులపై నడపకూడదు.నిర్దేశిత పరిమితికి మించి అతివేగంతో ప్రయాణించడం ప్రమాదకరం. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు,

మిగతా 2 లో... ▸

# మెనూ ఖచ్చితంగా అమలు చేయాలి

- విద్యార్థులతో కలిసి బోజనం చేసిన తహాశీల్దార్



**నేలకొండపల్లి, జులై 30 ప్రజాజ్యోతి :** ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు అందించే బోజనం మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. గురువారం రాత్రి స్థానిక ప్రభుత్వ హస్టల్ ను ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వసతి గృహం పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులను కలిసి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టూడెంట్స్ ప్రగతి ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... నాణ్యమైన భోజనం ను ఇవ్వాలని ఆదేశించారు. మెనూ విషయంలో రాజీ పడితే సహించేది లేదన్నారు. విద్యార్థులు ప్రభుత్వం .అందించే ప్రోత్సాహంతో ప్రయోజకులు కావాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలలో ఉండే విద్యార్థులు ఇంటి వద్ద ఉన్నమనే భావన కలిగేలా వాతావరణం కల్పించాలని సూచించారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి మండల కేంద్రం లోని బీసీ బాలికల వసతి గృహం లో గురువారం విద్యార్థినులకు ప్లేట్స్, గ్లాస్, స్పూన్, దుప్పట్లు పంపిణీ చేశారు.

## పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.గురువారం ఖమ్మం కార్పోరేషన్ పరిధి 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు,మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ప్రతి విద్యార్థికి అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ పాఠశాల వయస్సు గల ప్రతి ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని,ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని అన్నారు.పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యం,విద్యాభ్యాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ప్రోత్సహించారు. విద్యాప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు,అధికారులు,తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం పాఠశాల లోని మధ్యాహ్న భోజనం అన్నం,ఆకుకూరల పప్పు,సాంబారు,రాగిజావ ను పరిశీలించారు.విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియ, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, విద్యా శాఖ సిబ్బంది,తదితరులు ఉన్నారు.

## ఖమ్మంలో నిస్సాన్ "టెక్ టోన్" కారు ఆవిష్కరణ






(మొదటి పేజీ తరువాయి...)

రహదారి సంకేతాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అ త్యుత _మ ఫీచర్లు,అద్భుతమైన భద్రత – వి వి సి గ్రూప్ ఎండీ రాజేంద్రప్రసాద్ వివిసి గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వంకాయల పాటి వెంకట రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, నిస్సాన్ టెక్ టోన్ కారు వినియోగదారులకు సరి కొత్త అనుభూతిని అందిస్తుందన్నారు. ముఖ్య ఫీచర్లు, ప్రత్యేకతలు: ఇంజిన్ & పవర్: ఈ మోడల్ 1.0 లీటర్ (100 హెచ్ పి, 166 ఎన్.ఎం టార్క్ – ఆరు స్పీడ్ మాన్యువల్),1.3 లీటర్ (163 హెచ్ పి , 280 ఎన్ ఎం టార్క్ – 6–స్పీడ్ మాన్యువల్ అండ్ డీసీట్ ఆటోమేటిక్) టర్బో పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్లలో లభిస్తుంది. లగ్జరీ ఆప్షన్లు: పనోరమిక్ సన్‌రూఫ్ విశాలమైన డ్రైవింగ్ అనుభూతిని ఇవ్వగా, ప్రయాణంలో వేడి తెలియకుండా వెంటిలేటెడ్ సీట్లు ప్రత్యేకంగా ఉపయోగపడతాయి. స్టోరేజ్: ప్రయాణాల కోసం అతిపెద్ద బూట్ స్పేస్ సౌకర్యం కలదు. అత్యున్నత భద్రత: ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ కీప్ అసిస్ట్, అటానమస్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ (Level–2 ADAS) వంటి అడ్వాన్స్‌డ్ సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. ఐదు –స్టార్ రేటింగ్: ఈ కారు బి ఎన్ సి ఏ పి క్రాష్ టెస్ట్‌లో 5–స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించి అత్యంత సురక్షితమైన కారుగా నిలిచిందన్నారు. ధర దీని ప్రారంభ ఎక్స్–షోరూమ్ ధర రూ. 10.49 లక్షలుగా ఉందని పేర్కొన్నారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిసి నిస్సాన్ షోరూమ్ జనరల్ మేనేజర్, సేల్స్ ప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల గడపకే పాలన సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం





(మొదటి పేజీ తరువాయి...)

దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గం సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఒకేసారి అందరికీ ఇళ్లు మంజూరు చేస్తే ఆర్థిక భారం పెరుగుతుందని, అందుకే దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.8.5 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి రాజీ ఉండదన్నారు. సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో గత 50 సంవత్సరాలుగా ఉన్న రెవెన్యూ సమస్యలను భూ రీ–సర్వే ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సర్వే కొనసాగుతోందన్నారు. మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా భూ రీ–సర్వే పూర్తి చేసి శాశ్వత పరిష్కారం అందిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు విచారణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. పేదల భూములు ఎలా కాజేయబడ్డాయో, భూముల మళ్లింపులు, ప్రభుత్వ భూముల అక్రమ బదిలీలు అన్నీ ప్రజలకు వెల్లడవుతాయని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. గత యాసంగి లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామని, ప్రతిపక్షాలు అనవసర రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని బీఎల్‌వోలకు ఆగస్టు 3లోపు తప్పనిసరిగా అందజేసి ఓటు హక్కును పరిరక్షించు కోవాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గ ప్రజాదర్బార్‌లో వచ్చిన 25 వేల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతోందని, సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో 3,500 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో గృహ నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయని చెప్పారు. మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి భూ సర్వే నిర్వహిస్తున్నా మని, ఇప్పటివరకు 2 వేల ఎకరాల్లో సర్వే పూర్తి చేసి త్వరలో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తును సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు ల్లో ఫోన్ నంబర్, ఆధార్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, పూర్తి సమాచారం ఉంటేనే సంబంధిత అధికారుల ద్వారా వేగంగా పరిష్కారం అందించగలమని కలెక్టర్ సూచించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు ప్రజల వద్దకే రావడం ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రత్యేకత అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో భూ సర్వే వేగంగా సాగుతోందని, రెండు నెలల్లో పెండింగ్ రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధరణి వల్ల భూములు కోల్పోయిన రైతులకు భూ భారతి ద్వారా న్యాయం జరుగుతోందని పేర్కొంటూ, సత్తుపల్లి నియోజకవర్గానికి అదనంగా 1,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల లోపు రుణ మాఫీ, విద్యార్థులకు యూనిఫాంలు, ఉచిత అల్పాహారం, వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రూ.15 కోట్లతో మున్సిపల్ అభివృద్ధి పనులు, సత్తుపల్లి లో రూ.25 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు మున్సిపాలిటీకి అదనంగా రూ.20 కోట్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ, కల్లూరు మునిసిపాలిటీ చైర్మన్ మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ ను బీసీ యువత సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రతిభావంతులైన యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్రప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను అందిస్తూ,బీసీ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు.గ్రామీణ,ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్, ఐపీఎస్,ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 2026, ఆగస్టు 24 నుంచి 2027, మే నెల వరకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు.నాణ్యమైన బోధనతో పాటు,కోచింగ్ సామగ్రి, గ్రంథాలయ సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, రెగ్యులర్ పరీక్షలు, మాక్ టెస్టులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా కల్పిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం కోచింగ్ కార్యక్రమానికి మొత్తం 150 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరిలో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా, మరో 50 మందిని ఇప్పటికే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేయనున్నట్లు వివరించారు.ఎంపికైన అభ్యర్థులకు స్టైపెండ్,అదనంగా ఒకేసారి పుస్తకాల గ్రాంట్ అందజేస్తామని అన్నారు.ఈ ఆర్థిక ప్రోత్సాహకాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో పోటీ పరీక్షలపై దృష్టి కేంద్రీకరించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన విద్యార్థులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని, యువత పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత లక్ష్యాలను తప్పకుండా చేరుకోగలరని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, బీసీ,ఎస్సి,ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 2026 ఆగస్టు 7 వరకు కొనసాగుతుందని, ఆగస్టు 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అర్హతలు, ఎంపిక విధానం,దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను టీజీ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధికారిణి జి. జ్యోతి, డైరెక్టర్ బీసీ స్టడీ సర్కిల్ గోన శ్రీలత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకట్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, టీజీ బీసీ స్టడీ సర్కిల్ ప్రతినిధులు,అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాను అరికడదాం మహిళలు, పిల్లలను రక్షిద్దాం

- **ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి**



**చింతకాని జూలై 30 (ప్రజాజ్యోతి)**

మానవ అక్రమ రవాణాను అరికడదాం మహిళలు, పిల్లలను రక్షిద్దాం అని ఐ సి డి ఎస్ చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. గురువారం చింతకాని మండల పరిధిలోని నేరడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ రాయల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ సంధ్యారాణి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని,నమ్మి మోసపోకూడదని అన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులను గుర్తించినట్లయితే హెల్ప్ లైన్ కు 1098, మహిళల హక్కులకు భంగం కలిగినట్లయితే 181 కి, అత్యవసర పరిస్థితి ఏర్పడితే 122కు, పోలీస్ శాఖ సేవలు అవసరమైతే 100కు, సైబర్ క్రైమ్ బాధితులు 1930 హెల్ప్ లైన్ కు ఆలస్యం చేయకుండా వెంటనే ఫోన్ చేసి, రక్షణ పొందాలని సూచించారు. అంగనవాడి టీచర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విసిపిసి కమిటీలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఉప సర్పంచ్ కోట ముత్తయ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా గ్రామంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా మా దృష్టికి తీసుకువస్తే పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు.ప్రభుత్వ పాఠశాల రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సరోజిని,వెంకమ్మ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలి

- జీ.యంకు వినతి పత్రం అందించిన ఐఎన్టియుసి కోటేశ్వరరావు



**సత్తుపల్లి జూలై30(ప్రజా జ్యోతి )** సత్తుపల్లి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లకు,ఇటీవల విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం వెంటనే వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, ఐఎన్టీయూసీ సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్,మినిమం వేజెస్ చైర్మన్ జనక్ ప్రసాద్ ఆదేశానుసారం, జేవీఆర్ ఓసీ పిట్ సెక్రటరీ సీతారామరాజు, కిష్టారం ఓసీ పిట్ సెక్రటరీ షణ్ముఖ చారి, జేవీఆర్ సీహెచ్‌పీ పిట్ సెక్రటరీ నగేష్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, సత్తుపల్లి ఏరియాలో పనిచేస్తున్న అనేక మంది సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లు గత 5 నుంచి 13 సంవత్సరాలుగా కొత్తగూడెం నుంచి సత్తుపల్లికి ప్రతిరోజూ అప్ అండ్ డౌన్ చేస్తూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇటీవల యాజమాన్యం విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం సీనియారిటీ ఆధారంగా వెబ్ కౌన్సిలింగ్ నిర్వహిస్తే, పలువురు కార్మికులు తమకు అనుకూలమైన ప్రాంతాల్లో విధులు నిర్వహించే అవకాశం లభించి,ఎంతో ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. అందువల్ల వెబ్ కౌన్సిలింగ్ ప్రక్రియను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే నిర్వహించాలని కోరారు.వినతిపై స్పందించిన జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు నజీర్, హమీద్, యశ్వంత్ రెడ్డి, యాకుబ్, రమేష్, రాజామొగిలి, శీను, గోపి, రాములు, రవి, సురేష్, అప్పారావు, కుమార్, మంగ్య, సత్య, రాఫీ,రవి చంద్రతో పాటు ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన పెను ప్రమాదం...!

- కారు ను డీకొట్టిన టిప్పర్...



**నేలకొండపల్లి, జులై 30 ప్రజా జ్యోతి :** కారు ను డికొట్టిన ఘటన లో నలుగురు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు..కారు డ్రైవర్ చాకచాక్యంతో పెను ప్రమాదం తప్పింది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నా యి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని చెరువు మాధారం గ్రామానికి చెందిన సోసైటీ మాజీ చైర్మన్ ఈవూరి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షుడు యడవల్లి శ్రీనివాస్, టి.గోవిందరావు లతో పాటు కారు డ్రైవర్ మెగలాలి లు కార్డు లో ఏపీ లోని చిల్లకల్లు లో పంచాయతీకు వెళ్తుండుగా ప్రమాదం జరిగింది. గురువారం చెరువుమాధారం నుం చి ఏపీ లోని చిలకల్లు పోలీస్ స్టేషన్ లో పంచాయతీ కోసం వెళ్తున్నారు. ఈ –క్ర మంలో మండలం లోని రాయగూడెం గ్రామ శివారు వద్దకు వెళ్లగానే...ఏపీ లోని విజయవాడ కు చెందిన టిప్పర్ మండలం లోని బుద్ధారం నుంచి రాయగూడెం వైపు వెళ్లాల్సి ఉండగా...కట్టుకాచారం రోడ్డు వైపు తిరిగాడు. రూట్ మారిన విషయం ను గ్రహించి టిప్పర్ డ్రైవర్ వెనక నుంచి రివర్స్ వస్తూ...వెనకనే వస్తున్న కారు ను గ్రహించలేదు. దీంతో కారు డ్రైవర్ చాకచక్యంగా కారు ను పూర్తిగా మార్జిన్ దిగి పోవటంతో కారు చివర భాగం టిప్పర్కు తగిలి కారు దెబ్బతిన్నది...అందులో ఉన్న నలుగురు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నలుగు రు స్వల్పగాయాలతో బయటపడ్డారు. రెప్పపాటు లో పెను ప్రమాదం తప్పటం తో ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు టిప్పర్ నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో వేంసూరు మండలానికి ప్రథమ స్థానం

**వేంసూరు,జులై 30 ప్రజాజ్యోతి** సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, రెవెన్యూ అధికారులకు నిరంతరం మార్గనిర్దేశనం చేయడం, అవసరమైన సూచనలు అందించడం వల్ల ఖమ్మం జిల్లా లోనే సత్తుపల్లి నియోజకవర్గం రెండవ స్థానంలో అలాగే నియోజక వర్గం స్థాయిలో వేంసూరు మండలం ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రథమ స్థానంలో నిలిచిందని పలువురు అభినందించారు.ఎంఆర్ఓ పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను చైతన్యపరిచారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా నమోదు కావాలనే లక్ష్యంతో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ విజయానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ నాయకత్వం, ఎంఆర్ఓ గారి కృషి, రెవెన్యూ అధికారుల సమర్థ నిర్వహణ, బీఎల్ఓలు మరియు బీఎల్ఏల అంకిత భావం ప్రధాన కారణాలని పేర్కొన్నారు.అలాగే సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమా ఆనంద్ బాబు వేంసూరు గ్రామ సర్పంచ్ ఎం.డి. ఫఖ్రుద్దీన్ అందించిన ప్రోత్సాహం, సహకారం కూడా కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించాయని కొనియాడారు.ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ఎంఆర్ఓ, రెవెన్యూ అధికారులకు, బీఎల్ఓలు, బీఎల్ఏలకు, ప్రజాప్రతినిధులకు ,అవగాహనతో నమో దు ప్రక్రియలో పాల్గొన్న ప్రతి ఓటరికి ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.



# బాల్య మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

- రూ.27 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేత.. మానవత్వాన్ని చాటుకున్న యువకులు



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :**ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన మేకల నాగేశ్వరరావు (38) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.ఆయనకు భార్య,ఇద్దరు కుమార్తెలు ఉండటంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.నాగేశ్వరరావు ఎం. వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు.తమ బాల్య మిత్రుడు అకాల మరణం చెందాడన్న విషయం తెలుసుకున్న సహ విద్యార్థులు, స్నేహితులు స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు.మిత్రులు అందరూ కలిసి రూ.27 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని సేకరించి గురువారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.కష్టసమయంలో స్నేహితులు అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్తులు, మహిళలు పేర్కొన్నారు. నాగేశ్వరరావు కుటుంబానికి అవసరమైనప్పుడు తమ సహకారం కొనసాగుతుందని స్నేహితులు తెలిపారు. స్నేహబంధం అంటే ఇదేనని,ఆపదలో తోడుగా నిలవడమే నిజమైన మానవత్వమని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో శీలం సుధాకర్,బేతంపూడి నానయ్య,పోతర్ల సతీష్,దరిపల్లి అప్పారావు,మంకేన ఉమాపతి,కామల్ల వెంకట్,గుదే యల్లయ్య, వడ్లమూడి రాంబాబు, వేముల పాపారావు, సామల విజయ్,పిల్లల మర్రి వెంకటేశ్వర్లు,నంద్ర మధు కృష్ణ,రెంటాల నాగేశ్వరావు,పాపిట్ల సంజీవరావు,తద్దె వెంకటనారాయణ,దేవరశెట్టి రామారావు, రెంటాల సతీష్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యులు ఎన్నిక



**సత్తుపల్లి జూలై30(ప్రజా జ్యోతి )** మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ ఆధ్వర్యంలో గురువారం కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 21 అంశాలను మున్సిపల్ పాలకవర్గం ఆమోదించారు. అదేవిధంగా ప్రత్యేక పరిజ్ఞానం,అనుభవం కలిగిన 4 వార్డు సభ్యులు డాక్టర్ కందిమల్ల కృష్ణారావు, వేములపల్లి పుష్పలత, మహమ్మద్ ఫయాజ్, బేతంపూడి దేవమణి లను కో ఆప్షన్ సభ్యులు ఎన్నుకున్నారు. వీరందరిని పాలకవర్గ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, మున్సిపల్ కమిషనర్ నరసింహ, మేనేజర్ శ్రీనివాస్,ఏ ఈ సురేష్ ,టిపిఓ రాజు ,భాస్కర్ ,ఆర్ ఐ దిలీప్ కుమార్,సీనియర్ అకౌంటెంట్ సుజాత, జూనియర్ అకౌంటెంట్ ఎస్ కే జరీనా, మెప్మా సి.వో ప్రసాదు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# జిల్లా కరగరని సందర్శించిన జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి దేవి మానస




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస జిల్లా కారాగారాన్ని సందర్శించి జైలు పరిసరాలు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అండర్ ట్రయల్ ఖైదీలతో (యు టి పి ఎస్ ) మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులైన పేద అండర్ ట్రయల్ ఖైదీలు తప్పనిసరిగా జిల్లా న్యాయ సేవా సంస్థ సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ప్రతి అర్హుడికి రాజ్యాంగబద్ధంగా ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ఉందని, న్యాయవాది నియామకం, న్యాయ సలహా తదితర సేవలు డీఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా అందించబడుతున్నాయని వివరించారు. ఖైదీల హక్కుల పరిరక్షణతో పాటు, న్యాయం అందరికీ చేరువ చేయడమే న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు.జిల్లా కారాగార సూపరింటెండెంట్ శ్రీధర్ జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంధకారంలో బొడ్రాయి వీధి ప్రజలు

- పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న వీధి
- దోమలు పాముల మధ్య వీధి ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

**తల్లాడ ప్రజా జ్యోతి** గ్రామం లోని బొడ్రాయి వీధి నందు గత కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో వీధి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు,స్థానికులు పలుమార్లు పంచాయతీ అధికారులకు, ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదంటూ వీధి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, "పన్నులు చెల్లిస్తున్నాం కానీ ఫలితం లేదు,కానీ కనీసం లైట్లు కూడా వేయడం లేదు" అని వీధి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం కావడంతో సాయంత్రం 6 గంటల తర్వాత వీధి మొత్తం అంధకారమయం కావడంతో రోడ్లపై విష సర్పాలు సంచరించడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నాం అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, వీధి పక్కన మరియు ఖాళీ ప్రదేశాలలో పిచ్చి మొక్కలు మొలచి అడవిని తలపిస్తుండడంతో దోమల బెడద ఎక్కువ అవ్వడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామంటూ,వర్షాకాలం మొదలై మూడు నెలలైనా ఎటువంటి బ్లీచింగ్ గాని, క్రిమిసంహారక మందులు గాని పిచికారి చేయలేదంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అదేవిధంగా రాత్రి సమయంలో చిన్న పిల్లలు,వృద్ధులు,మహిళలు బయటకు రావాలంటే భయపడుతున్నారు.ఏదైనా ప్రాణనష్టం జరిగితే గాని అధికారులు స్పందించరా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాబట్టి తక్షణమే అధికారులు స్పందించి బొడ్రాయి వీధిలో సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.



## మానవ అక్రమ రవాణా అరికట్టండి సూపర్వైజర్లు

- అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మకండి,విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**సత్తుపల్లి జూలై30(ప్రజా జ్యోతి)** మోసపూరితమాటలు,అపరిచిత వ్యక్తులను,మాయ మాటలు నమ్మి బాలికలు దగాకు గురి కావద్దని, సత్తుపల్లి మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ మహాలక్ష్మి ,రజిని,సుజాత,రమాదేవి లు సూచించారు.గురువారం సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు,మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 181 కు, ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ నెంబర్ 112 కు,పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 100 కు,సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు టోల్ ఫ్రీ నంబర్స్ కు కాల్ చేసి ఘోరాలపైసమాచారంఇవ్వాలన్నారు.ఆత్మ రక్షణ కోసం కరాటే లాంటి విలువిద్య నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగల్ల చిట్టికుమారి,ఉపాధ్యాయులు,అంగన్వాడీ టీచర్స్ అరుణ,రమాదేవి,తామారు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్ పర్సన్



**మధిర ప్రజా జ్యోతి** మున్సిపాలిటీ ఇల్లందులపాడు గ్రామానికి చెందిన పాస్టర్ ఆదాం–సువర్ణ రత్నం దంపతుల కుమారుడు పాల్ శ్యాం కుమార్ కు, ఎర్రుపాలెం మండలం పెగళ్లపాడు గ్రామానికి చెందిన బొక్క కిరణ్ బాబు దేవమ్మ దంపతుల కుమార్తె సోనియాతో వివాహం దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాల్ లో గురువారం అత్యంత వైభవంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు బంధుమిత్రులు,శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం దంపతులు విచ్చేసి,నూతన వధూవరులకు ఆశీస్సులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూర్యదేవర కోటేశ్వరరావు,అంజన బాబు, తదితరులు పాల్గొన్నారు.

## గంధం శకుంతల మృతికి పలువురు నివాళులు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల కేంద్రం ఎర్రుపాలెంకు చెందిన న్యాయవాది,సీనియర్ పాత్రికేయుడు గంధం శ్రీనివాసరావు మాతృమూర్తి గంధం శకుంతల (86) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు.ఆమె మృతి వార్త తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, న్యాయవాదులు, పాత్రికేయులు, వివిధ రంగాల ప్రముఖులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గంధం శకుంతల కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు.గంధం శకుంతల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని పలువురు ఆకాంక్షించారు.

# ఖమ్మం జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు భేష్

- ఎన్.సి.డి.సి కన్సల్టెంట్ డాక్టర్ సామ్ జాన్ ప్రశంస






**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ కన్సల్టెంట్ డాక్టర్ సామ్ జాన్ (స్టేట్ పబ్లిక్ హెల్త్ అవుట్ బ్రేక్ బృందం) గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలో అమలవుతున్న 10 రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.అనంతరం ఆయన ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, జిల్లా పబ్లిక్ హెల్త్ లాబొరేటరీ లను సందర్శించి, ఆయా ల్యాబ్ లలో జరుగుతున్న పరీక్ష లు,రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మామిళ్లగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు అందుతున్న తీరును నేరుగా వెరిఫై చేశారు. టీకా కార్యక్రమం (వీపీడీ ) పట్ల ప్రత్యేక అభినందనలు:జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా అమలవుతుండటం పట్ల డాక్టర్ సామ్ జాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యాక్సిన్ల ద్వారా నివారించదగిన వ్యాధుల నియంత్రణ కార్యక్రమం (వాక్సిన్ ప్రివేంటబుల్ డీజీసెస్ – వీపీడీ ప్రోగ్రాం ) అమలు తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఇదే సమయంలో, కార్యక్రమాలకు సంబంధించిన కీలక సూచికలను మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేయాలని, కొన్ని కీలక సూచనలను అధికారులకు అందించారు.ఈ సమీక్షా సమావేశంలో మరియు క్షేత్రస్థాయి పర్యటనలో ఐడిఎస్పి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఐ. మోధ్యా, ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణాదేవి, ఇన్చార్జ్ ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ ఇ.సాయి కుమార్, జిల్లా డేటా మేనేజర్ కె.కృష్ణమోహన్,ఎంపిహెచ్ఎస్ ఎ. సతీష్ తదితర వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మోడీ పాలనతో దేశంలో ఆర్థిక అంతరాలు

- కమ్యూనిస్టుల బలోపేతమే దేశానికి రక్ష
- మోడీ నిర్ణయాలు పదాన్ని కనుసన్నులోనే
- మాటలకే పరిమితమైన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధం కావాలి
- సిపిఐ శిక్షణ తరగతుల్లో బాగం హేమంతరావు




**బోనకల్, జూలై 30 (ప్రజా జ్యోతి):** మోడీ పాలన తీరుతో దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, ఈ పరిణామం దేశ భవిష్యత్ పై తీవ్ర పరిణామం చూపుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కార్పోరేట్ శక్తులు, దేశ సంపదను తమ గుప్పిట పడుతున్నారని ఆయన ఆరోపించారు. సిపిఐ మధిర, బోనకల్, చింతకాని మండలాల శిక్షణా తరగతులు గురువారం స్థానిక ఎస్ఆర్ కళ్యాణమండపంలో గురువారం జరిగాయి. ముందుగా ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు ఆవిష్కరించారు. బత్తినేని నీరజ ప్రిన్సిపాల్ గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో హేమంతరావు మాట్లాడుతూ... మోడీ అధికారంలోకి వచ్చే నాడు వందల కోట్లకు పరిమితమైన వారు, దశబ్దకాలంలో వేల, లక్షల కోట్లకు పడగలేత్తారన్నారు. ఆదానీ రూ.800 కోట్లకు పడగలెత్తారని, మోడీ నిర్ణయాలు చాలా వరకు, ఆదానీ కన్నునన్నల్లోనే తీసుకుంటారని హేమంతరావు ఆరోపించారు. ఇప్పుడు ఒక శాతం మంది ధనవంతుల చేతిలో 99 శాతం సంపద కేంద్రీకృతమైనదని అన్నారు. మోడీ పాలన ప్రజలను విస్మరించి సాగుతుందని, ప్రైవేట్ రంగం విరాజిల్లుతుందని హేమంతరావు తెలిపారు. ప్రధానమైన వ్యవసాయ రంగం, సంక్షోభంలో కూరుకుపోతుందని, నిరుద్యోగం పెరిగి పోతుందని, అల్పాదాయ వర్గాల సంఖ్య గణనీయంగా పెరగడం దేశంలో అశాంతికి కారణమవుతుందని అన్నారు. ఇదే సమయంలో మతోన్మాద శక్తులు ఈ దేశాన్ని భక్తి ముసుగులో విచ్ఛిన్నం దిశగా తీసుకెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోను ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, కాంగ్రెస్ కేవలం మాటలకే పరిమితవుతున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితిలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని, ఇందుకు అనుగుణంగా పార్టీ నిర్మాణ కర్తవ్యాలను నిర్వర్తించాలని అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సంసిద్ధులను చేయాలని అన్నారు. శాఖ నిర్మాణం పటిష్టంగా ఉండడంతో పాటు కార్యకర్తలను నిరంతరం పార్టీ కార్యక్రమాలలో పాల్గొనే విధంగా కార్యచరణ రూపొందిచుకోవాలని హేమంతరావు సూచించారు. పార్టీ ప్రచారం , ప్రజా ఆందోళనలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ మాత్రమే సామాజిక, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని హేమంతరావు తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో పార్టీ కర్తవ్యాలు, ప్రచారం అనే అంశాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్, భారత జాతీయ ఉద్యమం, కమ్యూనిస్టు పార్టీ పాత్ర అనే అంశాన్ని జమ్ముల జితేందర్ రెడ్డి, కులం, మతం, వర్గపోరాటం అనే అంశాన్ని సింగు నరసింహారావు, ప్రపంచీకరణ, దాని ప్రభావం అనే అంశాన్ని ఏనుగు వెంకటేశ్వరరావు భోదించారు. ఈ శిక్షణ తరగతులలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు గాంధీ, పావులూరి మల్లికార్జున రావు, ఎంఏ రహీం, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, జక్కుల రామారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, ఆకెన పవన్ పలువురు సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు గ్రామంలో సబ్ స్టేషన్ కొరకు స్థలం సేకరణ

- డిప్యూటీ సీఎం విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

**చింతకాని జులై 30 ప్రజా జ్యోతి :**మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆశీస్సులతో ప్రొద్దుటూరు గ్రామానికి నూతనంగా పైకెవి మెగావాట్ల కరెంట్ సబ్ స్టేషన్ మంజూరైనది ఆ సబ్జెషన్ నిర్మాణం కొరకు ప్రొద్దుటూరు గ్రామము నుండి చింతకాని పోయే రోడ్లో మెగా పార్క్ దగ్గర ఉన్న స్థలమును ఈ రోజు కరెంటు డిపార్ట్మెంట్ వారికి ప్రొద్దుటూరు గ్రామ సర్పంచ్ మొగిలి కృష్ణయ్య చేతుల మీదుగా స్వాధీనం చేయడమైనది ఈ సబ్ స్టేషన్ నిర్మాణంతో ప్రొద్దుటూరు రేపల్లెవాడ నాగిలిగొండ కోమట్ల గూడెం గ్రామాలకు కరెంట్ సదుపాయం అందుబాటులోకి రానున్నది సుమారు 40 సంవత్సరాల కల సహకారం కానుంది ఈ సబ్ స్టేషన్ ను మంజూరు చేసిన మల్లుబట్టి విక్రమార్కకి ప్రొద్దుటూరు గ్రామ ప్రజల తరఫున అభినందనలు కార్యక్రమంలో



ప్రొద్దుటూరు గ్రామ ఉపసర్పంచ్ శ్రీమతి గుర్రం చిట్టి, ప్రొద్దుటూరు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ పెంట్యాల పుల్లయ్య గారు చింతకాని ఏఈ శ్రీధర్, చింతకాని ఆర్ఐ శ్రీనివాసరావు, జిపిఒ కిరణ్, ప్రొద్దుటూరు గ్రామ వార్డు మెంబర్లు,తుళ్లూరు అచ్చయ్య,తుడుం రవి,గొర్రె ముచ్చు జాను,మరియు గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గీత కార్మికుల హామీలను వెంటనే అమలు చేయాలి

- "నీరాకు" బడ్జెట్లో కేటాయించిన రూ. 25 కోట్లు..
- సంక్షేమానికి కేటాయించిన రూ. 67 కోట్లు విడుదల చేయాలి
- 4 న మంచి కంటి భవన్ లో జరిగే సభను జయప్రదం చేయండి
- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపట్ల సుదర్శన్



**బోనకల్, జూలై 30 (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బోడపట్ల సుదర్శన్, జిల్లా కార్యదర్శి కొండం కరుణాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "అమరుల యాదిలో".. గీతన్నల చైతన్య యాత్రకు సంబంధించిన గోడ పత్రికలను మండల కేంద్రంలో గురువారం గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అమరుల యాదిలో.. గీతన్నల చైతన్య యాత్ర పేరుతో ఆగస్టు 2 నుంచి మానుకోట నుంచి ట్యాంకు బండి హైదరాబాదు వరకు యాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్ర ఆగస్టు 18 వరకు కొనసాగుతుందని తెలిపారు. అందులో భాగంగా ఆగస్టు 4వ తేదీన ఖమ్మంలోనే మంచి కంటి భవన్ లో భారీ సభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సభకు జిల్లా వ్యాప్తంగా గల కల్లుగీత కార్మిక సంఘం కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదాల నివారణ, వన రక్షణ, ఉపాధి, సంక్షేమం ఆధునీకరణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా పెన్షన్ రూ. 4000 రూపాయలకు, ఎక్స్ గ్రేషియా పదివేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో ప్రకారం 50 సంవత్సరాల పైబడిన గీత కార్మికులందరికీ పెన్షన్ ఇవ్వాలన్నారు. పెండింగ్ ఎక్సర్ డబ్బులు 20 కోట్లు వెంటనే బాధ్యతలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న కోటి తాటి, ఈత చెట్లకు నెంబర్లు వేసి చెట్లను రక్షించాలని డిమాండ్ చేశారు. ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని కోటి వరాల పథకంలో కల్లుగీత సొసైటీలకు ఇచ్చిన భూములకు ఫెన్సింగ్ నీటి సౌకర్యం కల్పించి పొట్టి, తాటి, ఈత, ఖర్జూర చెట్లు నాటాలని కోరారు. వృత్తి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కోసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీరాకు రాష్ట్ర బడ్జెట్ లో కేటాయించిన రూ. 25 కోట్లు, సంక్షేమానికి కేటాయించిన రూ. 67 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీరా సెంటర్లు నందనం, సర్వేల్, చారుగొండ, మునిపల్లి లలో పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. ప్రతి జిల్లాలో తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమంలో ఏర్పాటు చేసి యువతి యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఏజెన్సీ ఏరియాలో పూర్తిచేసే గీత కార్మికులందరికీ సభ్యత్వం ఇచ్చి సొసైటీలు ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని కోరారు. ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి రోజున ట్యాంకు బండిపై విగ్రహం ప్రతిష్టించాలని కోరారు. సర్వాయిపేట, తాటికొండ, ఖిలాషాపురం తదితర కోటలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్రవ్యాప్త యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, మండల నాయకులు బంధం శ్రీనివాసరావు, గండు సైదులు, కొండ నాగేశ్వరరావు, బోయినపల్లి పున్నయ్య, దారగాని కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ గ్రామీణ్ రోజ్‌గార్ అభియాన్ రైతు జలనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- వ్యవసాయ నీటి కుంట స్థలాన్ని పరిశీలించిన అధికారులు- గ్రామ సర్పంచ్



**చింతకాని, జూలై 30 ప్రజాజ్యోతి :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వికసిత్ భారత్ గ్రామీణ్ రోజ్‌గార్ అభియాన్ (విబిజి –ఆర్ఏజి ) కార్యక్రమంలో భాగంగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో అమలు చేస్తున్న రైతు జలనిధి (ఫార్మ్ పాండ్) పథకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు చింతకాని మండలంలోని తిరుమలాపురం గ్రామంలో గురువారం రోజు బల్లి రామకృష్ణ వ్యవసాయ క్షేత్రాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) కార్తీక్, గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, గ్రామపంచాయతీ టీఏవై. కృష్ణయ్య కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు తమ వ్యవసాయ భూముల్లో రైతు జలనిధి (ఫార్మ్ పాండ్)లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో సేకరించిన నీటిని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించడం ద్వారా సాగునీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. అంతేకాకుండా భూగర్భ జలాల మట్టం పెరగడం,పంటల దిగుబడి మెరుగుపడడం, ఎండాకాలంలో కూడా సాగుకు నీటి లభ్యత ఉండడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.ఫార్మ్ పాండ్‌ల ద్వారా చేపల పెంపకం, పశువుల తాగునీటి అవసరాలు తీర్చుకోవడం, సూక్ష్మ సేద్యం చేపట్టడం వంటి అదనపు ప్రయోజనాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. రైతుల భూవిస్తీర్ణాన్ని బట్టి వివిధ పరిమాణాల్లో ఫార్మ్ పాండ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ధరణి పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలతో గ్రామపంచాయతీ కార్యాలయం,వ్యవసాయ శాఖ అధికారులు,ఏపీఓ లేదా ఎంపీడీవో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణ చర్యలు చేపట్టి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో గోగుల నరసింహారావు,బల్లి వీరభద్రం, మడిపల్లి రామకృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షైన్ హై స్కూల్ లో గ్రీన్ డే సెలెబ్రేషన్స్ సంబరాలు



**బోనకల్, జూలై 30(ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని షైన్ హై స్కూల్ లో గ్రీన్ డే సంబరాలు గురువారం అంబరాన్ని అంటాయి. చిన్నారుల ఆటపాటలతో పాఠశాల వాతావరణం పండుగలా మారింది. విద్యార్థులకు ప్రకృతిని పరిరక్షించే విధంగా ఎలా ఉండాలో చెబుతూ మొక్కలు నాటించారు. పాఠశాల కరెస్పాండంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ... ప్రకృతిని పరిరక్షించే విధంగా నీటిని వృధా చేయకుండా ఉండటం, ప్లాస్టిక్ నివారణ, చెట్లను నరకకుండా ఉండటం, చెత్త కుండీలు వాడటం, పరిసరాల శుభ్రత మొదలగు అంశాల మీద పూర్తిస్థాయిలో అవగాహనా పాఠశాలలో ఇస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమం లో కరెస్పాండంట్ షేక్ అన్సర్ పాషా, ప్రిన్సిపాల్ అయిటిపాముల శ్వేత, అడ్మినిస్ట్రేషన్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు

- ఐసిడిఎస్ సూపర్వైజర్లు రమాదేవి, సుజాత
- బోనకల్ పాఠశాల లో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం



**బోనకల్, జులై 30 (ప్రజా జ్యోతి ):** అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐ సి పి ఎస్ ఆధ్వర్యంలో గురువారం బోనకల్ మండల కేంద్రంలోని జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు మానవ అక్రమ రవాణా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్స్ రమాదేవి, సుజాత లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మొద్దని, ఎవరైనా మోసపూరితంగా, బలవంతంగా తమను తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తే వెంటనే గట్టిగా అరుస్తూ చుట్టుపక్కల వారి సహాయం కోరాలని సూచించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితులలో పోలీసువారికి గాని, నేరాల హెల్ప్ లైన్ కు గాని సమాచారం అందించాలని అన్నారు. హెల్ప్ లైన్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు రమాదేవి, సుజాత, హై స్కూల్ ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి , అంగన్వాడీ టీచర్లు మిర్యాల రమాదేవి, మరియమ్మ, శిరీష, ఆశా కార్యకర్తలు లీలా కుమారి, దుర్గ , పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్కేపల్లి గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం



**చింతకాని జులై 30 ప్రజాజ్యోతి :** మత్కేపల్లి గ్రామంలో విబి –జి ఆర్ ఏఎం పథకం క్రింద రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు , గ్రామ సర్పంచ్ కంచం ద్రౌపది ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మత్కేపల్లి గ్రామ ప్రజల తరపున ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే, ఈ నిధుల మంజూరుకు విశేష కృషి చేసిన శ్రీమతి మల్లు నందిని భట్టి విక్రమార్కకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గ్రామంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బందెల నాగార్జున, నర్సింశెట్టి శ్రీనివాసరావు , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచం కోటేశ్వరరావు,గ్రామ ఉపసర్పంచ్ పగడాల పుల్లమ్మ , గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బోలకొండ రామారావు, వలమల వెంకటరామయ్య,సంకెళ్ల పాపారావు,తిరుపతి రామ్మూర్తి,బొల్లికొండ వెంకటనారాయణ , పగడాల రాంబాయి, సంకెళ్ళ అప్పమ్మ, గ్రామ సెక్రటరీ ఆర్కే రెడ్డి ,వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల కేంద్రంలోని స్థానిక ఎస్ జె కే యం కళాశాలలో గురువారం మధిర ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనకై మధిర ఎక్సైజ్ సీఐ రాములు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు కారాదని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను ఆశించాలని తల్లిదండ్రుల లక్ష్యాలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగిరెడ్డి సౌజన్య, నాగిరెడ్డి రమేష్ అధ్యాపకులు, ఆకుల రవి సత్యనారాయణ గోపీనాయక్ శ్రీనివాసరావు శ్రీనివాస రెడ్డి శిరీష కోటేశ్వరరావు ఎక్సైజ్ శాఖ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులపై సమన్వయ సమావేశం



**మధిర, ప్రజా జ్యోతి** పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులను వేగవంతంగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా పూర్తి చేసేందుకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో విద్యుత్ శాఖ జిల్లా స్థాయి అధికారులు, రోడ్లు–భవనాల శాఖ, మున్సిపల్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి పనుల పురోగతిపై చర్చించారు. భవిష్యత్తులో మిషన్ భగీరథ పైప్‌లైన్లు, కొత్త ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణాలు, మున్సిపల్ శాఖ అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని నిర్ణయించారు.అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, పట్టణ ప్రజలకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. అనంతరం అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులను అన్ని శాఖల అధికారులు పరిశీలించారు.ఈ సమావేశంలో విద్యుత్ శాఖ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డిఈ బండి శ్రీనివాసరావు, ఏడీఈఎం అనురాధ, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, ఆర్అండ్‌బీ డీఈ శంకరయ్యతో పాటు ఆయా శాఖల ఏఈలు పాల్గొన్నారు.

## అభ్యున్నతికి గ్రామ సమాఖ్య భవనాలు వేదిక కావాలి

**నేలకొండపల్లి, జులై 30 ప్రజా జ్యోతి :** గ్రామ సమాఖ్య భవనాలు మహిళల అభ్యున్నతి కి వేదికలు కావాలని తిరుమలాపురం పంచాయతీ సర్పంచ్ కమదన ప్రవీణ్ సూచించారు. మండలం లోని తిరుమలాపురం లో నూతనంగా నిర్మించనున్న గ్రామ సమాఖ్య భవనం కు గురువారం శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు... గ్రామాభివృద్ధి కి రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. పాలకవర్గం, గ్రామ పెద్దల సహాకారంతో గ్రామ పంచాయతీలో దశల వారీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో నిర్మించే గ్రామ సమాఖ్య భవనాలు వారి ఆర్థికాభివృద్ధి పెంచేందుకు దోహాదపడాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సురేష్ ఆంటోని, పంచాయతీ వార్డు సభ్యులు విజయబాబు, రమాదేవి, కీర్తన, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మధిర హరిజనవాడ నందు సామాజిక తనిఖీ





**మధిర ప్రజా జ్యోతి** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధిర హరిజనవాడ లో గురువారం జరిగిన సామాజిక తనిఖీ లో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు షేక్ నాగూర్ వలి విద్యార్థుల ప్రగతి, పాఠశాల ఆర్థిక నిర్వహణ,అభివృద్ధి, డిజిటల్ తరగతుల నిర్వహణ తదితర విషయాలపై సమగ్ర సమాచారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాలకు హాజరైన పెద్దలు 11వ వార్డు కౌన్సిలర్ గద్దల మాధురి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కృష్ణవేణి లు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆడిట్ అధికారులు పాఠశాలలోని మధ్యాహ్న భోజన నిర్వహణ, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్ నిర్వహణ, సైన్స్ ల్యాబ్, గేమ్స్ కిట్, లైబ్రరీ బుక్స్, పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, వివిధ రకాల రికార్డుల ను క్షుణ్ణంగా పరిశీలించారు.సోషల్ ఆడిట్ నేపథ్యంలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.అనంతరం ఉపాధ్యాయులతో జరిగిన పాఠశాల అభివృద్ధి రివ్యూ లో పాఠశాల భౌతిక వనరులైన ఆటస్థలం, కంప్యూటర్ ల్యాబ్, వాల్ పెయింటింగ్, డ్రింకింగ్ వాటర్ తదితర విషయాలపై పాఠశాల తరపున ఆప్పీల్స్ ఇవ్వటం జరిగినది.సోషల్ ఆడిట్ నందు సామాజిక సేవకులు మాధవరపు నాగేశ్వర రావు, ఉపాధ్యాయులు కొలగాని శ్రీనివాసరావు, గుర్రం శ్రీను, ఎన్ వై ఎన్ బట్టాచ ర్య, షేక్ లాల్ అహ్మద్, శంషాద్ బేగం, కె. రాజ్యలక్ష్మి , పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అమెరికాలో ఆర్థిక సంక్షోభంతోటే ఇరాన్‌పై యుద్ధం

- కాంగ్రెస్ పునాదులపైనే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం
- పార్లమెంట్ అనుమతి లేకుండా పెద్ద నోట్లో రద్దు...
- జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక స్వయం ప్రతిపత్తి రద్దు




**బోనకల్, జూలై 30 (ప్రజా జ్యోతి):** అమెరికా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, దాని నుంచి బయటపడేందుకే ఇరాన్ పై అమెరికా తన మిత్ర దేశమైన ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరగు సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని వీవీఆర్ గార్డెన్ లో సీపీఐ(ఎం) మండల స్థాయి పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ముందుగా సీపీఐ(ఎం) చిరునోముల సీనియర్ నాయకులు వేమ రామయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ శిక్షణా తరగతులకు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కిలారు సురేష్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. "జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు – వర్తమాన రాజకీయాలు"అనే అంశాన్ని మెరుగు సత్యనారాయణ బోధించారు. ప్రపంచ దేశాలపై ప్రధానంగా కమ్యూనిస్టు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విషం కక్కుతున్నారన్నారు. ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను కమ్యూనిస్టు దేశమైన చైనా అడ్డుకుంటుందన్నారు. ఇరాన్ కు మద్దతుగా చైనా నిలవటం వల్లే అమెరికా భయపడిపోతుందన్నారు. ప్రపంచంలో నేడు చైనా, అమెరికా దేశాన్ని ఢీకొట్టే స్థాయికి చేరిందన్నారు. అమెరికా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ప్రతి సందర్భంలోనూ తన ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు దేశాలపై యుద్ధాలకు దిగుతుందన్నారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు తాకట్టు పెట్టాడని ఘాటుగా విమర్శించారు. నరేంద్ర మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల భారతదేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలతో భారతదేశంలో విచ్ఛిన్నకర విధానాలను ముందుకు తీసుకువస్తుందని ఆరోపించారు. ఆ ప్రయత్నాలను కమ్యూనిస్టులుగా మనం తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వైఫల్యం ఫలితంగానే బీజేపీ దేశంలో బలపడి అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ రైతు కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుందని వీటికి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) దేశవ్యాప్తంగా పోరాటాల నిర్వహిస్తుందని స్పష్టం చేశారు.

### ››› మతం వ్యక్తిగతం - మతోన్మాదం ప్రమాదకరం :

**సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు పాపినేని రామ నర్సయ్య**

మతం వ్యక్తిగతమని దీనివల్ల ఎవరికీ, సమాజానికి ఎటువంటి ప్రమాదం లేదని కానీ మతోన్మాదం తీవ్ర ప్రమాదకరమని సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు పాపినేని రామనర్సయ్య తెలిపారు. "మతం – మతోన్మాదం" అనే అంశాన్ని పాపినేని రామ నర్సయ్య బోధించారు. మతాన్ని అడ్డం పెట్టుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. హిందూ మతం పేరుతో దేశాన్ని విభజించేందుకు ప్రయత్నం చేస్తుందని విమర్శించారు అందులో భాగమే రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. మతం చాలా ఆకాశవంతంగా ఉంటుందని కానీ సమస్యలను మాత్రం పరిష్కారం చేయదు అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో కష్టాలు పెరుగుతాయని దాని ఫలితంగానే మతం వైపు ప్రజలు మల్లుతున్నారన్నారు. ఈ శిక్షణ తరగతులకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు బంధం శ్రీనివాసరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## 2025 కిష్టారం ఓసి కి ద్వితీయ బహుమతి

- ఘనంగా 56వ వార్షిక భద్రత పక్షోత్సవం

**సత్తుపల్లి జూలై30(ప్రజా జ్యోతి)**సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన 56వ వార్షిక భద్రతా పక్షోత్సవం–2025 లో భాగంగా సత్తుపల్లి ఏరియా లోని కిష్టారం ఓసి ప్రాజెక్టు కి గ్రూప్ – III ఓసీ గనుల విభాగంలో ఓవరాల్ పర్ఫార్మన్స్ లో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ ఎల్ ఎస్ వి సునీల్ వర్మ ఆధ్వర్యంలో కిష్టారం ఓసి నందు అభినందన సభ గురువారం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి మరియు మైన్ మేనేజర్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ విజయం సాధించడంలో కృషి చేసిన ప్రతి ఉద్యోగిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ సురక్షితమైన పని వాతావరణాన్ని కొనసాగించాలని ప్రోత్సహించారు. అనంతరం, మిఠాయిలను ఉద్యోగులకు పంపిణీ చేసి, ఈ విజయాన్ని సంతోషంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కిష్టారం ఓ సి గని మేనేజర్ బి రామకృష్ణ, అడిషనల్ మేనేజర్ వల్లమల్ల బాబు, సేఫ్టీ ఆఫీసర్ గోపి కిశోర్ , ఏఐటియుసి పిట్ సెక్రెటరీ కిశోర్ కుమార్, ఐ ఎన్ టి యు సి పిట్ సెక్రెటరీ షణముక చారి, ఇతర అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు మరియు డి ఎల్ ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

